కోల్‌కతా ఘటనపై పెల్లుబికిన ఆగ్రహం

- ఐఎంఏ ఆధ్వర్యంలో ర్యాలీ
- సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేత
- సంఘీభావం తెలిపిన రెడ్‌క్రాస్, ఇతర సంఘాలు


సబ్ కలెక్టర్ ప్రఖర్‌జైన్‌కు వినతిపత్రం అందజేస్తున్న వైద్యులు

తెనాలిరూరల్: కోల్‌కతాలో ట్రైనీ డాక్టర్ హత్యాచార ఘటన, హతురాలికి న్యాయం చేయాలంటూ అక్కడే వైద్యులు, వైద్య విద్యార్థులు చేసిన నిరసన ప్రదర్శన సందర్భంగా వారిపై దాడి చేయడాన్ని నిరసిస్తూ ఇండియన్ మెడికల్ అసోసియేషన్ తెనాలి శాఖ ఆధ్వర్యంలో ప్రైవేటు వైద్యశాలల్లో వైద్యులు 24 గంటల పాటు వైద్య సేవలను నిలిపివేశారు. స్థానిక బోసు రోడ్డులోని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ తెనాలి శాఖ కార్యాలయంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఐఎంఏ సభ్యులు, వైద్యులు పాల్గొన్నారు. కోల్‌కతా నగరంలో ట్రైనీ డాక్టర్‌పై జరిగిన హత్యాచార ఘటనను తీవ్రంగా ఖండించారు. ఐఎంఏ కార్యాలయం వద్ద నుంచి వైద్యులందరూ ప్రదర్శనగా సబ్ కలెక్టర్ కార్యాలయానికి బయలుదేరి వెళ్లారు. ట్రైనీ డాక్టర్‌పై దాడిని ఖండిస్తూ ప్లకార్డులు ప్రదర్శించారు. ఐఎంఏ నిరసనకు డెంటల్ మెడికల్ అసోసియేషన్, ఫిజియోథెరపీ అసోసియేషన్, రోటరీ క్లబ్ ఆఫ్ తెనాలి వైకుంఠపురం తదితర సంఘాల తరఫున మద్దతు తెలియజేశారు. ప్రదర్శనగా కొత్తపేటలోని సబ్ కలెక్టర్ కార్యాలయానికి వెళ్లి సబ్ కలెక్టర్ ప్రఖర్ జైన్‌కు వినతి పత్రం అందజేశారు. ట్రైనీ డాక్టర్‌పై హత్యాచారానికి పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని కోరారు. ఈ సందర్భంగా ఐఎంఏ అధ్యక్షురాలు డాక్టర్ విజయలక్ష్మి, కార్యదర్శి డాక్టర్ పావని ప్రియాంక, సహాయ కార్యదర్శి డాక్టర్ మధు ప్రభాకర్ మాట్లాడుతూ ఈ సంఘటన తమను ఎంతగానో బాధించిందన్నారు. పనిచేసే చోట స్త్రీలకు తగిన రక్షణ లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. బాధితురాలికి న్యాయం జరిగే విధంగా పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. నిరసన ప్రదర్శనలో తెనాలి బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి హరిదాసు గౌరీ శంకర్, ఫిజియోథెరపీ అసోసియేషన్ సభ్యులు, రెడ్‌క్రాస్ చైర్‌పర్సన్ ముమ్మనేని భానుమతి, వివేకనంద ఛారిటబుల్ ట్రస్ట్ సభ్యులు పాల్గొని మద్దతు తెలియజేశారు. కార్యక్రమంలో ఐఎంఏ వైద్యులు డాక్టర్ జె కోటి నాగయ్య, డాక్టర్ ఉమా మహేశ్వరరావు, డాక్టర్ ఉదయ్ భాస్కర్, డాక్టర్ హిమని, డాక్టర్ జీవనలత, డాక్టర్ అనిల్ కుమార్, డాక్టర్ శేషగిరిరావు, డాక్టర్ పురుషోత్తమ రావు, డాక్టర్ దక్షిణామూర్తి, డాక్టర్ మస్తానమ్మ, డాక్టర్ శ్యామ్ ప్రసాద్, డాక్టర్ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

వైద్యశాలలో పనిచేసే వారికి రక్షణ కల్పించాలి

తెనాలిఅర్బన్: ప్రభుత్వ, ప్రైవేట్ వైద్యశాలలో పని చేసే వైద్యులు, సిబ్బందికి ప్రభుత్వాలు రక్షణ కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని పలువురు వైద్యులు కోరారు. కోల్‌కత్తాలో వైద్యురాలిపై జరిగిన హత్యాచారం, హత్యకు నిరసనగా శనివారం తెనాలి జిల్లా వైద్యశాలలో వైద్యులు, సిబ్బంది నిరసన ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజల ప్రాణాలను కాపాడే విషయంలో తాముముందు ఉంటామని చెప్పారు. అలాంటి తమకే రక్షణ లేకపోవడం బాధకరమన్నారు. కోల్‌కత్తా మహిళ వైద్యురాలి హత్యాకేసులో దోషులకు కఠిన శిక్షలు విధించాలని డిమాండ్ చేశారు. అలాగే వైద్యశాలలో పనిచేసే ఉద్యోగులపై దాడులు చేస్తే కఠిన శిక్షలు విధించే విధంగా ప్రభుత్వం చట్టాలు తీసుకురావాలని కోరారు. ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు ఓపీ సేవలు నిలిపివేశారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ డాక్టర్ సౌభాగ్యవాణి, ఆర్ఎంవో డాక్టర్ మల్లిఖార్జునరావు, వైద్యులు డాక్టర్ సింహాచలం, డాక్టర్ శ్వేత, సిబ్బంది పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న జిల్లా వైద్యశాల వైద్యులు, సిబ్బంది

- కోల్‌కత్తాలో వైద్యురాలిపై జరిగిన హత్యకు నిరసనగా బుర్రిపాలెం రోడ్డులోని అన్నాబత్తుని సత్యనారాయణ ఫార్మసీ కళాశాలలో శనివారం నిరసన తెలియజేశారు. విద్యార్థులు, అధ్యాపకులు నల్లబ్యాడ్జీలు ధరించి దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. వైద్యశాలలో పనిచేసే ప్రతి ఒక్కరికీ పటిష్ట భద్రత కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ కె.వెంకట రమణ, పలువురు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి అజయ్‌కుమార్

మహిళల భద్రతకు కేంద్రం ప్రత్యేక చట్టాలు తీసుకురావాలి

తెనాలిఅర్బన్: మహిళల భద్రతకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక చట్టం తీసుకురావాలని సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. గాంధీనగర్‌లోని సీపీఐ కార్యాలయంలో తెనాలి నియోజకవర్గ ముఖ్య నాయకులు సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోల్‌కత్తాలో మహిళ వైద్యురాలిపై జరిగిన హత్యను తీవ్రంగా ఖండిస్తున్నట్లు ప్రకటించారు. వైద్యశాలలో రోగులకు చికిత్స అందించే వైద్యులకే రక్షణ లేకపోవడం దురదృష్టకరమన్నారు. ప్రజాస్వామ్య ఎటువైపు వెళ్తుందో అర్థం కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో నియోజకవర్గ కార్యవర్గ సభ్యులు పరుచూరి వెంకటేశ్వర్లు, నియోకవర్గ కార్యదర్శి చెరుకుమల్లి సింగారావు, పట్టణ కార్యదర్శి మద్దినేని కిరణ్; సీనియర్ నాయకులు బొల్లిముంత కృష్ణ, ఏఐఎస్ఎఫ్ నాయకులు పాశం వెంకటేష్, కుంభ రవితేజ, బిల్లా రాజేష్, చెన్నూరి సాయి, కావేటి యశ్వంత్, తదితరులు పాల్గొన్నారు.

వైద్యురాలిపై హత్యాచారానికి నిరసనగా కొవ్వొత్తుల ర్యాలీ

తెనాలి: కోల్‌కతాలో వైద్యురాలిపై జరిగిన హత్యాచారాన్ని నిరసిస్తూ నృత్యశిక్షణ విద్యార్థినులు శనివారం రాత్రి తెనాలిలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ప్రముఖ కూచిపూడి నృత్యగురువు పెసర్లంక వసంతదుర్గ ఆధ్వర్యంలో అయితానగర్‌లోని శ్రీలక్ష్మీనారాయణ కూచిపూడి నృత్య కళానికేతన్ నుండి ర్యాలీ బయలుదేరింది. గాంధీచౌక్ వరకు కొనసాగింది. రెయిన్‌బో ట్రస్ట్ వ్యవస్థాపకులు డాక్టర్ డి.జీ వనలత, ట్రస్ట్ సభ్యులు, నృత్యకళాశాల చిన్నారులు, తల్లిదండ్రులు, మహిళలు అధికసంఖ్యలో పాల్గొన్నారు. పెసర్లంక గోపీ పర్యవేక్షించారు. కోల్‌కతాలో వైద్యురాలిపై హత్యాచారానికి పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని, బాధితురాలికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. డాక్టర్ పి.శ్రుతిమౌనిక, డాక్టర్ కె.లలితా రాజేశ్వరి, అందె బాలచంద్రమౌళి, తూమాటి అపర్ణ, రేఖ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



తెనాలిలో కొవ్వొత్తుల ర్యాలీ

క్లుప్తంగా

అత్తోటలో కేఎల్ వ్యవసాయ విద్యార్థులు



తెనాలి: కేఎల్ యూనివర్శిటీ, వ్యవసాయ కళాశాల ఫైనలియర్ విద్యార్థులకు ఆర్ఏడబ్ల్యూఈపీ కార్యక్రమంలో నియోజకవర్గంలోని కొల్లిపర మండల గ్రామం అత్తోట గ్రామాన్ని కేటాయించారు. వి.భార్గవ్‌తేజ, డి.రవికిరణ్, ఆర్.సత్యఅన్వేష్, ఎం.మోహన సాయి, షేక్ అబ్దుల్ వాజిద్, ఎం.తేజ సాయి, పి.సురేంద్ర, షేక్ ఫరీద్, ఎ.హేమంత్, కె.రోహిత్ వెంకట్‌లు గ్రామంలో విలేజ్ మ్యాప్, క్రాప్ క్యాలెండర్, గ్రామానికి సంబంధించిన వివిధ అంశాలను రూపొందించారు. గ్రామంలోని జిల్లా పరిషత్ హైస్కూలులో వీటికి సంబంధించిన చిత్రాలను రైతులు, స్కూల్ విద్యార్థులు అభినందించారు.

వేబిల్లులో తేదీ ఏమార్చి...



కొల్లిపర: మున్నంగి గ్రామం వద్ద కృష్ణా నది కరకట్ట దిగువన ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఇసుక స్టాక్ పాయింట్ వద్ద నుంచి ఈనెల 12వ తారీకున తీసుకున్న వేబిల్లు పై 17 తారీకుగా మార్చి ఇసుకను తరలిస్తున్న ఏపీ39యు జీ2939 లారీని శనివారం రీచ్ వద్ద విధులు నిర్వహిస్తున్న పోలీసులు గమనించి వెంటనే సదరు లారీని కొల్లిపర పోలీసు స్టేషన్‌కి తరలించారు. ఏఎస్ఐ పోతురాజు లారీని సీజ్ చేసి లారీ డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థులకు నగదు ప్రోత్సాహం



మున్నంగి(కొల్లిపర): మండలంలోని మున్నంగి గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల (ఆర్)లో గతేడాది 5వ తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన ముగ్గురు విద్యార్థులకు గ్రామానికి చెందిన ఆళ్ల గోపిరెడ్డి శనివారం ఉపాధ్యాయుల సమక్షంలో అయ్యంకి నమ్రత, దాది యశశ్రీ, బాణావత్ నాగచైతన్య నాయక్‌కు నగదు ప్రోత్సాహం అందించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు గోపిరెడ్డిని శాలువాతో సత్కరించారు.

వరద బాధితులకు విరాళాలు సేకరణ



తెనాలిఅర్బన్: కేరళ రాష్ట్రంలో ఇటీవల సంభవించిన వరదల్లో ప్రాణాలు కోల్పోయిన కుటుంబాలను ఆదుకునేందుకు మారీసుపేటలోనీ ఎన్‌సీఆర్ ఎన్ఎంహెచ్ స్కూల్ విద్యార్థులు శనివారం పట్టణంలో విరాళాలు సేకరించారు. రూ.15 వేలు వచ్చాయని, వాటిని జిల్లా కలెక్టర్‌కు అందజేయనున్నట్లు ఎన్‌సీసీ అధికారులు పులి భాస్కర్, స్వామి, నాగిరెడ్డిలు తెలియజేశారు.

ప్రకృతి వ్యవసాయాన్ని పరిశీలించిన అమెరికా బృందం



తాడేపల్లిరూరల్: ఆంధ్రప్రదేశ్‌లో ప్రకృతి వ్యవసాయం చాలా బాగుందని, అమెరికాకు చెందిన బృందం కితాబు ఇచ్చారు. అమెరికాకు చెందిన హెడ్ గ్రీన్ హైడ్రోజన్ ఆర్గనైజేషన్ బృందం కుంచనపల్లిలో ఆరుమళ్ల సాంబిరెడ్డి చేస్తున్న ఆర్గానిక్ వ్యవసాయాన్ని శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా బృంద సభ్యులు ఏరిక్ సోల్హీమ్ మాట్లాడుతూ ఆర్గానిక్ వ్యవసాయాన్ని ఇక్కడ రైతులు చాలా చక్కగా చేస్తున్నారని, ఇలాంటి వ్యవసాయం చేయడం వల్ల ప్రజలకు ఆరోగ్యపరంగా ఎంతో మేలు జరుగుతుందని అన్నారు. అనంతరం పంటపొలం వద్దే ఆర్గానిక్ స్టోర్‌ను పరిశీలించారు. తోటను పలు భాగాలుగా విభజించి అంతస్తులుగా ఏర్పాటు చేసి పండిస్తున్న పంటలను ఆయన పరిశీలించి అభినందించారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్ట్ మేనేజర్ రాజకుమారి మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయాన్ని ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని అన్నారు. అలాగే ప్రకృతి వ్యవసాయంపై వెలుగు గ్రామ సంఘాలతోను, శాంతి మహిళా సంఘ సభ్యులతో అవగాహన కల్పిస్తున్నామని, ఇప్పటికే చాలామంది ప్రకృతి వ్యవసాయ పద్ధతులను, వాటి లాభాల గురించి తెలుసుకుంటున్నారని ఆమె అన్నారు. కార్యక్రమంలో అమెరికా బృందం నిశాంత్ బాలషణ్ముఖం, దూబే పాల్గొన్నారు.

వార్డు అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీల సమస్యలను పరిష్కరించండి



తెనాలిఅర్బన్: గ్రామ పంచాయతీ సెక్రటరీలకు ఉన్న అధికారాలను వార్డు అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీలకు కూడా కల్పించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఏపీ రాష్ట్ర వార్డు పరిపాలన కార్యదర్శుల సంఘం నాయకులు రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌ను శుక్రవారం రాత్రి తెనాలిలో కలిసి వినతిపత్రం ఇచ్చారు. కార్యదర్శుల సమస్యల పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో అధ్యక్ష కార్యదర్శుల ఎం.శేషుబాబు, పి.రాజ్‌కుమార్, నాగార్జున, మున్నీస్వా, పృథ్వీ రాజ్, ఆశాదీప్, బాషా, మధు, అనూష, తదితరులు పాల్గొన్నారు.

శిక్షణ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోండి

తెనాలిఅర్బన్: స్కూల్ కాంప్లెక్స్ ట్రైనింగ్ ప్రోగ్రాంలను ఉపాధ్యాయులు సద్వినియోగం చేసుకోవాలని మండల విద్యాధికారి మేకల లక్ష్మీనారాయణ సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు పట్టణంలోని ఎన్‌సీఆర్, కెఎస్ఎం, బాయ్స్ హైస్కూల్‌లో స్కూల్ కాంప్లెక్స్ ట్రైనింగ్ ప్రోగ్రామ్‌లను శనివారం నిర్వహించారు. ప్రైమరీ విద్యార్థుల లెర్నింగ్ ప్రాక్టీస్ గురించి, ఫార్మేటివ్, సమ్మేటివ్, అసెస్‌మెంట్స్ గురించి తెలియజేశారు. సమావేశంలో ఎంఈవో వి.జయంతిబాబు, రీసోర్స్‌పర్సన్ నందకుమార్, హెచ్‌ఎం సుధారాణి, పలువురు ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బోసు రోడ్డులో ఆక్రమణలు తొలగింపు



తెనాలిఅర్బన్: పట్టణంలోని ప్రధాన రహదారులపై ఉన్న ఆక్రమణలను తొలగిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న పేర్కొన్నారు. బోసురోడ్డులో శనివారం జరుగుతున్న అక్రమణల తొలగింపు పనులను ఆయన పరిశీలించారు. మురుగు కాల్వలపై ఎటువంటి బండలు, మెట్లు వంటి వాటిని నిర్మించవద్దని సూచించారు. వ్యాపారులందరూ అధికారులకు సహకరించాలన్నారు. ఆయన వెంట ఏసీపీలు సుధాకర్, సుబ్బారావు, టౌన్‌ప్లానింగ్ సిబ్బంది ఉన్నారు.

విద్యార్థి దశలోనే నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలి

ఎంఈవో డాక్టర్ మేకల లక్ష్మీనారాయణ

తెనాలి: విద్యార్థులు పాఠశాల స్థాయినుంచే నాయకత్వ లక్షణాలను అలవరచుకోవాలని మండల విద్యాధికారి డాక్టర్ మేకల లక్ష్మీనారాయణ సూచించారు. పట్టణ చెంచుపేటలోని నారాయణ స్కూల్‌లో శనివారం ప్రజాస్వామ్య పద్ధతిలో రహస్య బ్యాలెట్ ద్వారా విద్యార్థులు తమ నాయకులను ఎన్నుకున్నారు. ఎన్నికైన నాయకుల బాధ్యతల స్వీకారోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన డాక్టర్ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ, విద్యార్థులు శారీరక, మానసిక అభివృద్ధికి క్రమశిక్షణతో కూడిన విధానాన్ని అలవరచుకోవాలని సూచించారు. నారాయణ స్కూల్ ఏజీఎం కె.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ దేశ నాయకులను మనం ఏవిధంగా ఎన్నుకుంటామో? అలాగే స్కూల్ క్యాబినెట్‌ను ఎన్నుకోవటం విద్యార్థులు బాధ్యతతో వ్యవహరించేందుకు స్ఫూర్తిని ఇస్తుందన్నారు. ఎన్నికైన విద్యార్థి నాయకులకు ముఖ్యఅతిథులు బ్యాడ్జీలను ధరింపజేశారు. నారాయణ స్కూల్స్ ఆర్ఐ బి.పూర్ణిమ, ప్రిన్సిపాల్స్ డి.శ్రీనివాసరావు, నాగలక్ష్మి, ఆర్ఎస్‌టీ శ్రీను, ప్రైమరీ కో-ఆర్డినేటర్ బేబి రాణి, ప్రీ ప్రైమరీ కో-ఆర్డినేటర్ ప్రతిభ, హైస్కూల్ డీన్ జి.శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థినులు చదువులో ముందు ఉండాలి


మాట్లాడుతున్న రైల్వే చైల్డ్ హెల్త్ లైన్ మెంబర్ లక్ష్మణ్

తెనాలిఅర్బన్: విద్యారినులు చదువులో ముందు ఉండాలని రైల్వే చైల్డ్ హెల్త్ లైన్ మెంబర్ లక్ష్మణ్ పేర్కొన్నారు. కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన బేటీ బచావో బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మారీసుపేటలోని ఎన్‌సీఆర్ ఎన్ఎంహెచ్ స్కూల్‌లో అవగాహన సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పాఠశాలలో విద్యార్థుల సంఖ్యకంటే విద్యార్థినుల సంఖ్య ఎక్కువగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. చదువుకోవడం ద్వారా అనేక ప్రయోజనాలు ఉన్నాయన్నారు. అలాగే లైంగిక వేధింపులకు గురికాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు అందరూ తెలుసుకోవాలన్నారు. ఎంఈవోలు మేకల లక్ష్మీనారాయణ, వి.జయంతిబాబులు మాట్లాడుతూ బాలికలకు పౌష్టికాహారాన్ని ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు. సమగ్ర శిక్ష ద్వారా అమలవుతున్న అనేక పథకాలను విద్యార్థినులు ఉపయోగించుకోవాలని సూచించారు. కోల్‌కత్తాలో జరిగిన వైద్యురాలి హత్య ఘటన బాధకరమన్నారు. బాలికలు సమాజాన్ని గమనిస్తూ ధైర్యంగా జీవించాలని సూచించారు. సమావేశంలో ప్రధానోపాధ్యాయులు పి.వి.సుధారాణి, మహిళా పోలీసులు సౌమ్య, వెంకటలక్ష్మి, అనూష, సీఆర్‌పీ శ్రీదేవిలు పాల్గొన్నారు.

మంచినీటిని సద్వినియోగం చేసుకోండి

కమిషనర్ బండి శేషన్న


మంచినీటి సరఫరాను పరిశీలిస్తున్న కమిషనర్ శేషన్న

తెనాలిఅర్బన్: తెనాలి పురపాలక సంఘం ఆధ్వర్యంలో ప్రతిరోజు పట్టణంలో రక్షిత మంచినీటిని సరఫరా చేస్తున్నట్లు కమిషనర్ బండి శేషన్న పేర్కొన్నారు. పట్టణంలోని 32వ వార్డులోని యడ్ల లింగయ్య కాలనీలో శనివారం ఆయన పర్యటించారు. ఆ ప్రాంతంలో జరుగుతున్న పారిశుద్ధ్య నిర్వహణ పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. మంచినీటిని వృథాగా పోనియకుండా దానిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూడాలన్నారు. ఆయన వెంట పలువురు మున్సిపల్ అధికారులు, సిబ్బంది ఉన్నారు.

20 నుంచి ప్రతి ఓటు పరిశీలించాలి

కొల్లిపర: ఈనెల 20 నుంచి ప్రతి బీఎల్ఓ ఇంటింటికి వెళ్లి ఓటు ఉన్న వ్యక్తి వివరాలను పరిశీలించాలని తహసీల్దారు సిద్ధార్థ తెలిపారు. శనివారం స్థానిక రెవిన్యూ కార్యాలయంలో బీఎల్ఓలతో ఓటు పరిశీలన కార్యక్రమం గురించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండి ప్రతి ఒక్కరికీ ఓటు నమోదు చేయాలని, ఓటు ఉన్న వ్యక్తి మృతి చెందిన వారిని గుర్తించి వారి కుటుంబసభ్యుల వద్ద నుండి మరణ ధృవీకరణ పత్రం తీసుకొని వారి ఓటు తొలగించాలని, ఓటు కార్డులలో తప్పులు ఉంటే అటు వంటి వారి వద్ద నుంచి సరైన ధ్రువపత్రాలు తీసుకొని అటువంటి వారికి ఎటువంటి తప్పులు లేకుండా ఓటు కార్డులో మార్పులు చేర్పులు చేయాలని సూచించారు. ఒకే కుటుంబ సభ్యుల ఓట్లు అన్నీ ఒకే పోలింగ్ బూత్ లోకి తీసుకురావాలని సూచించారు. బీఎల్ఓలు ఓటు పరిశీలించే సమయంలో ఎటువంటి సమస్యలు ఉన్న వెంటనే తన దృష్టికి తీసుకురావాలన్నారు. ఓటు పరిశీలన విషయంలో ఎటువంటి తప్పులు జరిగిన ఆ సంబంధిత బీఎల్ఓ పై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ బెజ్జం కోటేశ్వరరావు(సాయి), జూనియర్ అసిస్టెంట్ బొద్దు నాగ కోటి కిరణ్‌తేజ, బీఎల్ఓలు తదితరులు పాల్గొన్నారు.

దొంగలని పట్టుకున్న గ్రామస్తులు

కొల్లిపర: మండల పరిధిలోని పాతబొమ్మువానిపాలెం గ్రామంలో పాడి పశువులను దొంగిలించటానికి వచ్చిన ముగ్గురు వ్యక్తులను గ్రామస్తులు గ్రహించి ఇద్దరిని పట్టుకున్న సంఘటన శుక్రవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. దీనిపై పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం పాతబొమ్మువానిపాలెం గ్రామానికి చెందిన తుమాటి స్వాతి భర్త అజయ్‌బాబుకు చెందిన పశువుల పాక, ఇళ్లు రెండు ఒకే చోట ఉన్నాయి. అర్ధరాత్రి సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు తన పశువులపాకలోకి వెళ్లిన సమయంలో అక్కడ ఉన్న కుక్క ఆపకుండా అరుస్తూ ఉండటంతో తను, తన భర్త లేచి బయట రాగా గుర్తు తెలియని ముగ్గురు వ్యక్తులు వారి పశువుల పాకలోనుంచి పారిపోయారు. పక్కన ఉన్న అందర్నీ నిద్రలేపి వారిని పట్టుకున్నారు. దొంతనానికి వచ్చిన వారు దుగ్గిరాల మండలం ఈమని గ్రామానికి చెందిన తిప్పగుడిసి దేవదాసు, గాలి రామరావు. మరొకరు నెమలకంటి వెంకటేశ్వరరావు పరారీలో ఉన్నాడు. వీరిపై స్వాతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఏఎస్ఐ పోతురాజు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇనుము దొంగతనం కేసులో ఇద్దరి అరెస్టు

తాడికొండ: రాజధానిలో ఇనుము దొంగిలిస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్లు తుళ్లూరు సీఐ గంగా వెంకటేశ్వర్లు శనివారం తెలిపారు. శుక్రవారం ఇనుము దొంగిలించి తరలిస్తున్న వ్యక్తుల కదలికలను గమనించి ఎన్‌సీసీ సంస్థ సూపర్‌వైజర్ పి.బాలకృష్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు చెప్పారు. ఎస్ఐ అంకమ్మ ఆధ్వర్యంలో ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్లు పేర్కొన్నారు. వీరిలో మంగళగిరికి చెందిన ఆటో డ్రైవర్ శివ శంకర్, రాయపూడి గ్రామానికి చెందిన సత్యనారాయణ ఉన్నట్లు తెలిపారు. అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ వివరించారు.

ఎన్ఆర్ఐలో చిన్నారికి అరుదైన చికిత్స


వివరాలు వెల్లడిస్తున్న వైద్యులు

మంగళగిరి: నగర పరిధిలోని ఎన్ఆర్ఐ ఆస్పత్రి ఆవరణలోని అమెరికా అంకాలజీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ (ఏఓఐ) మంగళగిరి ఆధ్వర్యంలో 12 ఏళ్ల బాలుడికి లైఫ్ సేవింగ్ సర్జరీ నిర్వహించారు. శనివారం వైద్యులు వివరాలను వెల్లడించారు. డాక్టర్ అయినంపూడి ఇషాంత్ నిర్వహించిన ఈ కేసు ఏఓఐ వద్ద పిడియాట్రిక్స్ అంకాలజీ కేర్‌లో గణనీయమైన విజయానికి ప్రతీకగా నిలిచిందన్నారు. అఖిల్ ఎస్‌కే అనే బాలుడు తొడ ఎముక యొక్క కుడి చివర అస్థియోస్కార్కోమాతో అనే క్యాన్సర్ జబ్బుతో బాధపడుతున్నాడు. సాధారణంగా పొడవాటి ఎముకలను ప్రధానంగా కాళ్లలో మరీ ముఖ్యంగా మోకాలి చుట్టూ ఇది ఎక్కువగా ప్రభావితం చేస్తుందన్నారు. వేరేచోట అఖిల్ మూడు సార్లు కీమోథెరఫీ చేయించుకున్నాడు. సర్జరీ చేస్తే కాలు తొలగించాల్సి ఉంటుందన్నారు. బాలుడి తల్లిదండ్రులు ఏఓఐ మంగళగిరిలో సంప్రదించగా డాక్టర్ అయినంపూడి పూర్తిస్థాయి పరీక్షలు నిర్వహించారు. విజయంతంగా శస్త్ర చికిత్స నిర్వహించారు. విజయవాడ, గుంటూరు, వైజాగ్, రీజియనల్‌లలో 12 ఏళ్ల చిన్నారిపై 8 ఏళ్ల తర్వాత విజయవంతంగా శస్త్రచికిత్స నిర్వహించడం అభినందనీయమన్నారు. సీటీఎస్ఐ దక్షిణాఫ్రికా సీఈఓ డాక్టర్ హరీష్ త్రివేది మాట్లాడుతూ ఈ శస్త్రచికిత్స విజయవంతం పిల్లల అంకాలజీలో వినూత్న పరిష్కారాల ప్రాముఖ్యతను హైలెట్ చాటుతుందన్నారు. కార్యక్రమంలో ఏఓఐ రాష్ట్ర రీజియన్ ప్రతినిధి మహేంద్రరెడ్డి పాల్గొన్నారు.

అనాథాశ్రమానికి బియ్యం అందజేత

తాడేపల్లిరూరల్: ఎంటీఎంసీ పరిధిలోని నూతక్కిలోని మాతృచాయ అనాథాశ్రమానికి తాడేపల్లి రూరల్ వడ్డేశ్వరం కేఎల్ యూనివర్సిటీ భౌతిక శాస్త్ర విభాగానికి చెందిన అధ్యాపకులు శనివారం వంద కిలోల బియ్యాన్ని వితరణగా అందజేశారు. కార్యభౌతిక శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ కె.స్వప్న మాట్లాడుతూ కెఎల్‌యూ భౌతిక శాస్త్ర విభాగానికి చెందిన అధ్యాపకులు, ఎక్స్‌టెన్షన్ యాక్టివిటీ అనే కార్యక్రమంలో భాగంగా అనాథాశ్రమంలోని పిల్లలకు అవసరమైన సామగ్రిని అందజేసినట్లు చెప్పారు.

అడ్వాన్స్ క్యాన్సర్‌పై జాతీయ సదస్సు పోస్టర్ విడుదల



పోస్టర్‌ను విడుదల చేస్తున్న కేఎల్‌యూ వీసీ డాక్టర్ పార్థసారథి వర్మ

తాడేపల్లిరూరల్: ఎంటీఎంసీ పరిధిలోని తాడేపల్లి రూరల్ వడ్డేశ్వరం కేఎల్ యూనివర్సిటీలో ఈనెల 27, 28 తేదీలలో నిర్వహించనున్న అడ్వాన్స్ క్యాన్సర్‌ను కార్యక్రమ పోస్టర్‌ను శనివారం కేఎల్‌యూ వీసీ డాక్టర్ పార్థసారథి వర్మ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్యాన్సర్‌ను తొలిదశలో గుర్తిస్తే రోగి ప్రాణాలను కాపాడవచ్చని, క్యాన్సర్‌ను గుర్తించడానికి ఆధునిక టెక్నాలజీ ఏ విధంగా ఉపయోగించాలనే విషయాన్ని తెలుసుకోవాలని అన్నారు. జాతీయ స్థాయి ట్రెండ్ ఇన్ ఏపీ జెనిటిక్స్ క్యాన్సర్ డయాగ్నోసిస్ మరియు థెరపి అనే పేరుతో కేంద్ర ప్రభుత్వ సహకారంతో నిర్వహించనున్న జాతీయ సదస్సు పోస్టర్‌ను విడుదల చేసినట్లు చెప్పారు. ప్రో చాన్సలర్ డాక్టర్ కేఎస్ జగన్నాథరావు మాట్లాడుతూ క్యాన్సర్‌ను ముందుగానే ఆధునిక టెక్నాలజీతో గుర్తించడానికి కృత్రిమ మేధ, మెషిన్ లెర్నింగ్ టెక్నాలజీ ద్వారా ఎలా ఉపయోగించాలనే ఇతర అంశాలపై ప్రముఖ జాతీయ, అంతర్జాతీయ క్యాన్సర్ నిపుణులు మెడికల్ విద్యార్థులకు, బయో టెక్నాలజీ విద్యార్థులకు అవగాహన కల్పిస్తారని వివరించారు. సదస్సుకు డాక్టర్ ఎం.జానకి రామయ్య కన్వీనర్‌గా వ్యవహరిస్తుండగా బయో టెక్నాలజీ విభాగాధిపతి డాక్టర్ ప్రవీణ్ కుమార్ కో కన్వీనర్‌గా, కోటేశ్వరరెడ్డి, జ్ఞాన శేఖరన్‌లు కోశాధికారులుగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో ప్రొ వైస్ చాన్సలర్లు డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, డాక్టర్ ఎస్.వెంకట్‌రామ్, అకడమిక్స్ డాక్టర్ కె.రాజశేఖరరావు, విద్యార్థి సంక్షేమ విభాగ డీన్ డాక్టర్ కేఆర్ఎస్ ప్రసాద్, బయో టెక్నాలజీ విభాగాధిపతి డాక్టర్ ప్రవీణ్ కుమార్, సదస్సు కన్వీనర్ డాక్టర్ ఎం.జానకి రామయ్య పాల్గొన్నారు.